# శోభనం



## గోటేటి బాలకృష్ణమూర్తి

"మా తమ్ముడి బుగ్గలు కొరికెయ్యకమ్మా" అంది ఆడపడుచు తలుపు మూస్తూ.

దంపత తాంబూలాలు అయాయి. శోభ, అనంతం కూర్చున్నారు మంచానికి రెండు పక్కలా.

అగురువత్తి ధూపం, టార్టాయిస్ పొగ కలిసి, ఏ పొగ ఏదో తెలియకుండా తేలుతున్నాయి ఒకరిలో ఒకరు ఇమిడిపోయిన దంపతుల్లా.

"మోసపోయానోయ్" చిన్న ఛలోక్తి విసరబోయాడు అనంతం.

చురుక్కుమనేట్టు చూసింది బాంక్ ఆఫీసర్ శోభ.

గమనించని అనంతం వాక్యం పూర్తి చేశాడు- "పెళ్లినాడు కోడె తాచంతటి జడ చూశాను- ఇంతా చేసి మొండి తోకంత జుట్టా నీది?"

మగవాళ్లు వచ్చారు, వెళ్లారు, తనని బజారులో గొడ్డులా, అలంకరించిన గంగిరెద్దులా చూసి. కాబోయే పెళ్లి కొడుకుల దృష్టులు తన ముఖం మీద, తదితర భాగాల మీద వాలడం, వాళ్ల లొట్టలూర్చడం, తన చూపు కలసినప్పుడు పలాయనం చిత్తగించడం పరికిస్తూనే వుంది.

దోమ ఒకటి శోభ ముఖంపై వాలి రక్తం పీల్చుకుందుకు పరికరాల్ని సమకూర్చుకుంటోంది. టప్పున కొట్టింది శోభ.

అనంతం గతుక్కుమన్నాడు.

చేతుల్లో రక్తాన్ని, దోమ కళేబరాన్ని శోభ మంచినీటి చుక్క పోసి కడిగింది.

అనంతం దగ్గరకు జరిగాడు. శోభ దూరంజరిగింది.

చటుక్కున ఒరిగి చీర కొంగుపట్టాడు. పుటుక్కున లాగి ఊరుకుంది శోభ.

అమ్మా నాన్నలు సతతం మంతనాలు జరిపి, తనొక భారమయినట్టు విశదం చేసి, దారేపోయే ప్రతీ రెండు కాళ్లున్న కుర్రాడికీ పెళ్లి కొడుకని నామకరణం చేసి, అవని మాటల్తో, బాధ గూడుకట్టుకున్న చూపుల్తో తనను వేధించి చివరికి ఈ నిరుద్యోగి అనంతం చేత మూడు ముళ్లూ మెడకి వేయించారు. తను బరువైతే వేరే వుంటానంది, ఊరు నుంచి బదిలీ చేయించుకుందుకు ప్రయత్నించింది. ప్రతీ మొగవాడూ-జుట్టు వున్నా లేకపోయినా-తనను పక్క చేరే కోర్కెలతో చూడడంతో వేసారి 'ఊ' అంది ఈ పెళ్లికి.

చెయ్యి మీద వేలు వేశాడు అనంతం. చీమ కుట్టినట్టు విదిలించింది శోభ. నిరుద్యోగిఅయినా కట్నం రొక్కించి పుచ్చుకున్నాడు. ఇల్లరికం రావని స్పష్టం చేశాడు. కాపురానికి తన డబ్బుతో ఇల్లు పుచ్చుకోవాలి. అనంతం ఉద్యోగం కోసం ఇంకొన్ని గుమ్మాలు ఎక్కిదిగుతాడు. ప్రతీ రోజు అతని నిరుత్సాహంతో, చేతకానితనంతో, పశుత్వంతో తను కాపురం చెయ్యాలి.

నడుం చుట్టూ అనంతం చేయి. మెరుపులా లేచి నుంచుంది శోభ.

పక్క గదిలో పకపకలు.

తలుపుకు చిల్లుందేమోనని చూసింది. వెళ్లి తలుపు

ముందు తెర లాగింది.

వెనక నుంచి దండల మీాదుగా రెండు చేతుల్ని బంధించి, పారిండ్లను తాకుతూ శోభని చేతుల్లోకి తీసుకుని వెక్కిరి అన్నాడు అనంతం. మెలికలు తిరిగి కూర్చుని, ఆ చేతుల్లోంచి జారి తటాలున మంచానికి అవతలి వైపు నుంచుంది.

అప్పట్లు ముప్పట్లూ బాగా జరిగి తీరాలి. వియ్యపు రాలి లాంఛనాలు ఘనంగా జరగాలి. వాళ్లా పెట్టారు వస్తు వాహనాలు శోభకు- తమ డబ్బే తిరిగి ఇచ్చి. "అమ్మాయికి అత్తవారు పెట్టినవమ్మా ఇవి" అని అమ్మ అమ్మలక్కలకు గొప్పలు చెప్పినపుడల్లా అరికాలి మంట తలకెక్కేది శోభకు.

మంచం మీాద అడ్డంగా బోర్లా పడుకుని శోభ కటి ప్రదేశం చుట్టూ పట్టేశాడు. పమిట లాగి రవిక విప్పబోతే పై దారం పుటుక్కున తెగింది. బ్రా కొంచెం తొంగి మాసింది.

చుట్టు తిరిగి పైట సర్దుకుంది. ఇతనికి రవిక, బ్రాయేనా విప్పడం వచ్చా అన్న ఆలోచన మెరసి సమసి పోయింది. ఈ కొత్త వ్యక్తికి ఏమి వచ్చో రాదో తనకి తెలియదు. పదిహేను రోజులయింది తను బయటుండి. గర్భవతయే రోజులు. కుటుంబ నియంత్రణ గురించి ఈ వ్యక్తి ఆలోచించి వుంటాడని నమ్మకం ఏమిటి? డాక్టరు దగ్గర మాత్రలు తెచ్చుకుని వేసుకుంటోంది.




పటుక్కున లేచి గట్టిగా పట్టేశాడు. నొప్పి పెట్టి, చేతులు లాగి తోసేసి, 'బ్రూట్' అన్నంత పని చేసింది. అనంతం పైట వదలక పోవడంతో చీర పై పొర, కుచ్చెళ్ల ఊడి వచ్చేశాయి. పట్టు విడిపించుకుని కిటికీ వరకూ పరుగెత్తింది. తను లంగాతో, సగం తెరుచుకున్న రవికెతో మిగిలింది. చేతులు అడ్డుపెట్టుకుంది.

కౌగలించుకుని ముద్దెట్టుకోబోయాడు మూడు ముళ్లతో తన శరీరం మీాద అధికారాన్ని సంపాదించు కున్న అనంతం. మూతి ముడిచేసుకుంది శోభ. ఈ ముద్దుల్లో మధువుల్లేవు. కౌగిలిలో పూల సౌరభాలు లేవు.

అతని మగతనం విజృంభిస్తోంది. దోమలు తేనెటీగలై ముసిరి కుట్టేస్తున్నాయి. వెయ్యేత్తి కొట్ట లేకపోయింది.

అనంతం చేతులు వళ్లంతా తడిమేస్తున్నాయి. దూరం పరుగెత్తుకు వచ్చిన కుక్కలా వగురుస్తున్నాడు.

గది వెనుక గడబిడ.

రోజు విడిచి రోజు తెల్లవారు ఝామున మూడింటికి గంటపాటు వచ్చే మంచినీళ్ల కోసం పాలు పితుకుతున్నంత శ్రద్ధగా వేచి వుండే సమయం. ఒడిసి పట్టి మంచం మీాదకు చేర్చాడు శోభని. దారాలు తెగి రవిక తెరుచుకుంది. గట్టిగా మూడంకె వేసి ఊపిరి బిగ పట్టేసింది శోభ.

తెల్లని బట్టలపై వచ్చిన దోమల రక్తపు మరకలు.

భళ్లున తెల్లారింది.

"ఒరే కళ్లు జ్యోతుల్లా వున్నాయి-మరదలు పిల్ల రాత్రంతా జాగారం చేయించిందేమిట్రా నీ చేత?" అంది ఆడపడుచు ఏం జరిగిందో తెలుసుకోవాలని కుతూహలపడుతూ.

